

# మానస మయూరి

## - కస్తూరి మురళీకృష్ణ



(గత సంచిక తరువాయి)

**పొద్దున్న శరత్‌కి** మెలుకువ వచ్చేసరికి ప్రశాంతి, సుమంత్‌ని బ్రతిమలాడుతోంది. ‘సినిమాలు మనలాటి వాళ్ళకి కావురా. ఎంతోమంది సినిమాల్లోకి వెళ్ళి దెబ్బతిని దివాణం లేకుండా తిరగటం చూస్తున్నాం కదరా! నీకీ పిచ్చి ఎలా పట్టిందిరా? ఇంజనీరింగ్ చదువుతున్నావెందుకు? అప్పుడే సినిమా కోర్సు ఏదయినా చేస్తే బావుండేది కదా!‘

‘అమ్మా.. మీతో ఇదే గొడవ. మనం ఎందుకు బ్రతుకుతున్నాం చెప్పు? ప్రతిక్షణం గురించి, డబ్బు గురించీ ఆలోచిస్తూ బ్రతకటం ఒక బ్రతుకేనా? చెప్పు, మీరిద్దరూ ఎప్పుడయినా మీ కోసం ఒక్క క్షణమైనా బ్రతికేరా? నాన్న అయినా తన గదికి వెళ్ళి ఒంటరిగా తన పుస్తకాలు, పాటల నడుమ తనకు ఇష్టమైనట్టు బ్రతుకుతారు. నువ్వు? ఆఫీసు, ఇల్లు, వంట తప్ప నీకంటూ జీవితం ఏది? నీకోసం నువ్వు గడిపిన క్షణం ఏది? నాకు అలా జీవితం ఎవరికోసమో గడిపేసి ఎంత త్యాగం చేశాం అని అనుకోవటం, అదేదో గొప్పగా భావించటం ఇష్టంలేదు. నాకు నా జీవితం నా ఇష్టమైనట్టు, నా కోసం బ్రతకాలని ఉంది. అది తప్పా? మీరు కోరేది నేను సుఖంగా, సంతోషంగా ఉండాలనే కదా? నాకు సినిమాలంటే ఇష్టం. నేను రేపు డబ్బు లేక మలమల మాడినా, రోడ్ల మీద బిచ్చమెత్తుకుంటూ తిరిగినా నాకు సంతోషమే. ఎందుకంటే, నేను నా ఇష్టాన్ని అనుసరించాను. ఎవరో చెప్పింది చేసి జీవితాంతం ఏడుస్తూ, కుములుతూ బ్రతకటం లేదు.‘

ప్రశాంతి ఏడవటం ఆరంభించింది.

‘అమ్మా.. నువ్వు ఏడవకు. ఏడ్చినా నా నిర్ణయం మారదు. నన్ను ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చెయ్యాలని ప్రయత్నించకు.‘ వెళ్ళిపోయాడు సుమంత్.

శరత్ గదిలోకి తొంగి చూశాడు.

ఒంటరిగా కూర్చుని శూన్యంలోకి చూస్తోంది ప్రశాంతి. ఆమె కళ్ళనిండా నీళ్ళున్నాయి. జాలిగా అనిపించింది శరత్‌కు. ఆమెపై ప్రేమ పొంగి పొర్లింది. దగ్గరగా వెళ్ళాడు. శరత్‌ని చూడగానే ఆమె కళ్ళల్లోంచి నీళ్ళు జలజల జాలువారాయి.

ఆమెని దగ్గరకు తీసుకున్నాడు శరత్. అతని గుండెల్లో తలదాల్చి వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది ప్రశాంతి.

ఆమెని మరింత దగ్గరగా హత్తుకుని తల నిమురుతూ మౌనంగా ఉండిపోయాడు శరత్.

అతని మనసులో అనేక విచిత్రమైన భావనలు పడి లేస్తున్నాయి.

ఎందుకు ఏడుపు? ఎందుకు బాధ?

చిన్నప్పటి నుంచీ పిల్లలు పెద్దలు చెప్పిన మాట వినకుండా ఉండటానికే ప్రయత్నిస్తారు. బెదిరించి, కొట్టి, ఇదివ్వం, అదివ్వం అనో, ఇదిస్తాం, అదిస్తాం అనో పిల్లల్ని లొంగదీస్తారు పెద్దలు. కానీ ఎదిగిన తరువాత పిల్లలు తమ ఇష్టాన్ని అనుసరిస్తే ఎందుకు బాధ?

శరత్ ఒక్క మాట మాట్లాడలేదు. కానీ అతడి స్పర్శలో, సాన్నిహిత్యంలో తనకు తెలియకుండానే సాంత్వన లభించింది ప్రశాంతికి. కాస్సేపటికి కళ్ళు తుడుచుకుంది.

'పదండి. తయారవండి. ఆఫీసుకి లేటవుతుంది' అంది.

నవ్వాడు శరత్. 'గానుగెద్దు జీవితానికా?' అడిగాడు.

శరత్‌వైపు కోపంగా చూసింది ప్రశాంతి.

'అవును. ఈ గానుగెద్దు జీవితం గడుపుతూ సంపాదించిన డబ్బుతోనే ఈరోజు వాడు నేను నా ఇష్టం అనే స్థాయికి ఎదిగాడు. వాడి అది మరిచిపోతే వాడికే నష్టం. వాడు అన్నంత మాత్రాన నేను గానుగెద్దు అవుతానా? అయినా, మనం ఎదిగేటప్పుడు ప్రపంచం ఇలా ఉండేదా? ఈ సెల్‌ఫోన్లు, యూట్యూబులు, ఫేస్‌బుక్‌లు ఉండేవా? ఇన్ని ఉద్యోగాలు, ఇంత అవకాశాలూ ఉండేవా? ప్రభుత్వోద్యోగం కోసం ఎంత పోటీ ఉండేది? అంత మందిలో అంత పోటీని తట్టుకుని ఉద్యోగం సంపాదించాం. వాడిని సంపాదించమనండి. పోటీ పడలేక 'సినిమా' అని తప్పించుకుంటున్నాడు వెధవ' అంది.

శరత్‌కి నవ్వు వచ్చింది. ఆపుకోలేకపోయాడు. పెద్దగా నవ్వేశాడు.

'ఎందుకా విలన్ నవ్వు?' అడిగింది తానూ నవ్వుతూ.

'మొత్తానికి వాడు సినిమా అంటే ఇష్టపడికాదు, ఉద్యోగాలతో పోటీపడలేక సినిమా అంటున్నాడంటావు' అన్నాడు.

'వెర్రివెధవ. వాడికేం తెలుసు? తెలిసీ తెలియక బంగారు అవకాశాలు వదులుకుంటున్నాడు. అదీ బాధ' అంది.

'వాడికి తెలుసో, తెలియదో కానీ నిజంగా నీకోసం నువ్వు కాలం వెచ్చించి ఎంతకాలమయిందో కదా!' అన్నాడు శరత్.

శరత్ వైపు విచిత్రంగా చూసింది ప్రశాంతి.

'వాడేదో తెలిసీ తెలియక మాట్లాడాడు. మీరూ అలా అంటే ఎలా? నేను చాలా సుఖంగా సంతృప్తిగా వున్నాను. నాలో లేనిపోని అసంతృప్తులు కలిగించి అల్లకల్లోలం చేయకండి. నాకు తెలుసు. ఈ వాదనలు, ఈ సిద్ధాంతాలు కడుపునిండి ఒడ్డున చేరినవాడు మాట్లాడేమాటలవి. నా మటుకు నాకు నా కుటుంబమే నా జీవితం, నా కుటుంబ సంక్షేమమే నా సంతృప్తి. ఎప్పుడయితే నేను పెళ్ళి చేసుకున్నానో అప్పుడే 'నేను' అన్నది నశించి 'మనం' అయింది. ఎప్పుడయితే పిల్లలు పుట్టారో అప్పుడు మనం కూడా పోయింది. 'పిల్లలు - మనం' అయింది. సంసారం సాగరం అంటారు. సాగరంలో ఏ నీటి చుక్కకు ఆ నీటి చుక్క ప్రత్యేకమయినా, అంతా నీరే అవుతుంది తప్ప దేన్నీ ప్రత్యేకంగా పరిగణించం కదా! ఇదీ అంతే. సంసారం ఏర్పడనంతవరకూ నేనూ, మీరూ. అర్థమయితే సంతోషం. లేకపోతే ఎవరి ఖర్మ వారిది. నా జోలికి రాకండి' అంది.

'నేనేమీ అనటం లేదు. వాడు అన్నదే అన్నాను. నువ్వూ, నీ వ్యక్తిత్వం...'

శరత్ మాటలకు అడ్డు వచ్చింది ప్రశాంతి.

'ఏమిటీ నా వ్యక్తిత్వం? నేనూ, నా అసంతృప్తులు, నా స్వేచ్ఛ అని సంసారాన్నీ పిల్లల్నీ వదిలేసి ఊరెంబడి పడి తిరగనా? అదే నా నా స్వేచ్ఛ? అదే నా వ్యక్తిత్వం. మా ఆఫీసులో చూస్తున్నాను. కమల అని ఉంది. స్త్రీ స్వేచ్ఛ, విముక్తి అని కబుర్లు చెపుతుంది. మగవాళ్ళంతా చుట్టూ చేరతారు. మీద చేతులు వేయనిస్తుంది. ఎటు పిలిస్తే అటు వెళ్తుంది. ఇక అందరూ దాన్నో గొప్పదాన్ని చేసేశారు. ఏ మీటింగ్ అయినా, అదేదో గొప్ప తెలివిమంతురాలయినట్టు స్టేజీ ఎక్కిస్తారు. పొగుడుతారు. దాన్ని చూపించి మేమందరం పాతరాతి యుగానికి చెందిన వాళ్ళమయినట్టు, ఏన్టీ సోషల్ అయినట్టు వ్యాఖ్యానిస్తారు. 'ఆంటీ' అంటూ వెక్కిరిస్తారు. కానీ మాకున్న గౌరవం, ఆత్మవిశ్వాసం దానికి లేవు. మొగుడిని వదిలేయటం గొప్పకాదు. అసంతృప్తులున్నాయని మొగుడిని పిల్లల్ని వదిలి ప్రియుడితో పారిపోయి

అదేదో గొప్ప పని చేసినట్టు ప్రపంచానికంతటికీ సిద్ధాంతాలు, నీతులు వల్లించటం గొప్పకాదు. వాళ్ళ శరీరం వాళ్ళకి లాభం అనిపించిన ప్రతివాడికీ అంకితం. నా శరీరం నా భర్తకే అంకితం. ఎక్కడుంది వ్యక్తిత్వం చెప్పండి?'

శరత్ మాట్లాడలేదు. కానీ ఆమె మాటలలో అంతర్గతంగా ఉన్న సంఘర్షణ, క్షోభ అతడికి అర్థమయింది.

మౌనంగా ఆఫీసుకి తయారవసాగాడు.

'స్రవంతి ఏది?' అడిగాడు.

'ప్రొద్దున్నే స్పెషల్ క్లాసుకని వెళ్ళింది' చెప్పింది ప్రశాంతి.

'లంచ్ మరచిపోయారా?'

శిల్ప ఫోన్ చేసి అడిగే వరకు శరత్‌కు శిల్ప లంచ్ చేద్దామన్నది గుర్తుకు రాలేదు. తన ఆలోచనలలో, ఆఫీసు పనుల్లో పడి మరచిపోయాడు.

'వస్తున్నా' అన్నాడు.

'ఏమిటి దీర్ఘాలోచన?' అడిగింది శిల్ప శరత్‌ని చూడగానే.

జరిగింది చెప్పాడు.

'నాకు సుమంత్ ఆలోచనలు ఒకరకంగా అనిపిస్తే, ప్రశాంతి ఆలోచనలు ఇంకో రకమైన ఆలోచనలు కలిగిస్తున్నాయి. సమాజంలో మనుషుల మీద ముద్రలు వేయటం, వ్యక్తిగత బలహీనతలకు సిద్ధాంతాల ముసుగులు వేసి వాటిని సమాజానికంతా అన్వయించి ప్రచారం చేయటం వల్ల మాములు మనుషులలో ఎంత సంఘర్షణ చెలరేగుతోంది కదా అనిపిస్తోంది.' అన్నాడు.

'ఇది తప్పదు. మన సమాజంలో ఇది అధికం. ఇతర సమాజాల పరిస్థితులు వేరు. మన పరిస్థితి వేరు. మన సమాజంలో ప్రతీదీ ధర్మానికి ముడిపడివుంటుంది. దాంతో ప్రతి ఆలోచనా ధర్మంపై దాడిలా తోస్తుంది. ధర్మం పై దాడి చేయటం ఫేషన్ అనుకుని, గొప్పతనం అనుకుని గుడ్డిగా దాడిచేస్తారు. గొప్పగా ఫీలయిపోతారు.' అంది శిల్ప.

'అవును.. ప్రతి ఒక్కరూ పురాణపాత్రలను అవహేళన చేసేవారు. పురాణాలను దూషించి వెక్కిరించేవారే. వారికి పురాణాల గురించి ఏమాత్రం అవగాహనలేదు. పురాణ పాత్రల వ్యక్తిత్వాల పట్ల ఆలోచన లేదు. జంతువులు మల విసర్జన చేసేటప్పుడు ఇక్కడ చేయవచ్చు. ఇక్కడ చేయకూడదా? అని ఆలోచించవు. వీరూ అంతే. ఏ పాత్రను ఎలా అర్థంచేసుకోవాలి? ఏ సంఘటనను ఏ దృష్టితో చూడాలి అన్న అవగాహన లేదు కానీ ప్రతిదానిపై బురద జల్లుతారు. వారిలాంటి వారు వారికి వత్తాసు పలుకుతారు. ప్రజాస్వామ్యాన్ని పదిమంది కూడి గొంతు చించుకుని అరిస్తే అదే ప్రజాభిప్రాయం అవుతుంది. నిశ్శబ్దంగా ఉన్న తొంభై మంది ఈ పదిమందికి తలవంచాల్సి వస్తుంది. అదే జరుగుతోంది' అన్నాడు శరత్.

వాతావరణం బరువెక్కటం గమనించింది శిల్ప. టాపిక్ మార్చింది.

'మీ అబ్బాయి నిర్ణయం మీకు బాధకలిగించటం లేదా?'

'రెక్కలు వచ్చిన పక్షిని గూటిలో పెట్టి బంధించి ఉంచగలమా? వాడి ఇష్టం వాడిది. కానీ వాడికి సినిమా ప్రపంచం గురించి తెలియదు. అంతకన్నా ఎక్కువ రాక్షసమైనది. దానిలో ఎవరి అండదండలు లేకుండా, ఎలాంటి ఆశ్రయాలు లేకుండా నెట్టుకు రావటం ఎంత కష్టమో వాడికి తెలియదు. తెలియకుండా గుడ్డిగా ఆ ప్రపంచం వైపు పరుగులిడుతున్నాడు. ఇప్పుడూ నేనేం చెప్పినా వాడు తప్పుగా అర్థం చేసుకుంటాడు అలాగని నిప్పువైపు పరుగులిడేవాడిని హెచ్చరించకుండా ఉండటం భావ్యమా? ఇది నా సందిగ్ధ పరిస్థితి.'

'నిజమే. ఆ విషయం పై ఆసక్తి వుంది అన్న తరువాత 'వొద్దు' అంటే ఆసక్తిని చంపినట్టు అవుతుంది. వెళ్ళనిస్తే భవిష్యత్తు ఏమౌతుందో తెలియదు. నేను కూడా ఒక దశలో నా జీవితాన్ని సంగీతానికే అంకితమివ్వాలని అనుకున్నాను. ఉద్యోగాలు చేయకుండా, పెళ్ళిగిళ్ళి లేకుండా సంగీతమే సర్వంగా జీవించాలనుకున్నాను. కానీ కోరికలు వేరు. నిజ జీవితం వేరు. కలలు కలలే. నిజం నిజమే. జీవించాలంటే సంగీతం ఒక్కటే సరిపోదని తెలిసింది. దాని మీద ఆధారపడాలంటే బోలెడన్ని రాజకీయాలు చేయాలని తెలిసింది. మన ప్రతిభకూ మనకు వచ్చే అవకాశాలకూ మధ్య హస్తిమశకాంతరం ఉంటుందని తెలిసింది. ఉద్యోగం చేయక తప్పలేదు. పెళ్ళి చేసుకోక తప్పలేదు. జీవితం అన్నీ నేర్పిస్తుంది. మనిషి చెపితే  సాటి మనిషి వినడు. జీవితం అన్నీ నేర్పిస్తుంది. కానీ చాలా కఠినమైన పద్ధతిలో పాఠాలు నేర్పిస్తుంది' అంది శిల్ప.

ఆమె మాటలలో దాగిన అర్థం గ్రహించాడు శరత్. మౌనంగా ఉండిపోయాడు. ప్రతి మనిషి ఒక నీటి బిందువులాంటివాడు. కానీ నీటి బిందువులాగే ప్రత్యేక వ్యక్తిత్వం కలవాడు. కానీ సమాజ ప్రవాహంలో కలిస్తే ఎవరికి వారు వ్యక్తిత్వం కోల్పోయి నీటి ప్రవాహంలానే కనిపిస్తారు తప్ప ప్రత్యేకంగా కనబడరు.

తాను లక్షలాది ప్రభుత్వోద్యోగులలో ఒక సంఖ్య. ఒక పి.ఎఫ్ నెంబరు. తన  ప్రత్యేకత ఆ నెంబరులో కనబడదు.

మరో లెక్కల్లో ఇద్దరు సంతానం ఉన్న కుటుంబాలలో లేనిది ఒకటి. దాన్లో తన ప్రత్యేకత ఏది?

శిల్ప కూడా అంతే..

లక్షలాది ప్రభుత్వోద్యోగులలో ఒక అంకె ఆమె. ఎంతో మంది పాటగాళ్ళలో ఒక నెంబరు.

ఇద్దరూ ఎవరి ఆలోచనలలో వారు మౌనంగా ఉన్నారు.

చాలాసేపటికి శిల్ప అంది.

'నాకు సినిమా రంగంలో తెలిసిన వాళ్ళున్నారు. నన్ను కొందరు ప్లేబాక్ పాడమని అడిగారు. అది వేరే కథ. వాళ్ళ రిఫరెన్స్ ఇస్తాను. మీ అబ్బాయిని వెళ్ళి కలవమనండి. వాళ్ళు ఏదైనా సహాయం చేస్తారు' అంది.

నవ్వాడు శరత్.

'నా సహాయం లేకుండా వాడంతట వాడు తన జీవిత పథాన్ని నిర్దేశించుకోవాలని అనుకుంటున్నాడు. మళ్ళీ నేనేదో రిఫరెన్సులు ఇచ్చి వాడి వ్యవహారాలలో జోక్యం చేసుకోవటం నాకు ఇష్టం లేదు. అదీగాక, ప్రతివ్యక్తి తన భవిష్యత్తును నొసటి పై రాసుకుని ఈ భూమి పైకి వస్తాడని నా నమ్మకం. వాడికి ఏది రాసి ఉంటే అది జరుగుతుంది. మనం ఆత్రపడి, బాధపడి లాభం లేదు' అన్నాడు.

'ఇది పలాయన వాదం' అంది శిల్ప నవ్వుతూ.

'నాకు వాదాలు వివాదాలు తెలియదు. నేను నమ్మింది అది. ధూప్ థీ నసీబ్ మేతో, ధూప్ మే లియా హై దమ్, చాంద్‌నీ మిలీ తో హమ్, చాంద్ నీ మె సోలియే' అన్నాడు శరత్.

*(కొనసాగింపు వచ్చే సంచికలో)*

Post your comments